క్లుప్తంగా

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ట్రాన్స్‌కో డీఈఈ కార్యాయం వద్ద శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌ఏసీ అధ్యక్షుడు, ఆర్థిక సభ్యులు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర్య సభ్యులు జి.ఈశ్వరమ్మ హాజరవుతారని చెప్పారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా అదాలత్ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

చెంగాళమ్మ సేవలో సత్యవేడు ఎమ్మెల్యే



సత్యవేడు ఎమ్మెల్యేను సత్కరిస్తున్న చైర్మన్, ఈఓ

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరిని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఘనంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత ఆలయ మర్యాదలతో ఆయన్ని సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జగనన్న ఇళ్ల నిర్మాణంపై సమీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ డీవీనరసింహరావు ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో హౌసింగ్ సిబ్బందితో సమీక్షించారు. మండలంలో 602 ఇళ్లు పూర్తయ్యాయని, 120 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, వీటితోపాటు గ్రామాల్లో ఇళ్ల వద్ద వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. జగనన్న కాలనీల్లో కల్పించనున్న మౌలిక వసతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలను బట్టి వారికి బిల్లులు, సిమెంట్ చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ త్రివిక్రమ్‌రావు, ఏఈ సుబ్రమణ్యం, సిబ్బంది యుగంధర్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మోటార్ సైక్లిస్టులకు గాయాలు

ఏర్పేడు: లారీ ఢీకొని ఇద్దరు మోటార్ సైక్లిస్టులు గాయపడిన సంఘటన గురువారం మండలంలోని అంజిమేడు వద్ద చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు.. తిరుపతికి చెందిన జయశంకర్(35), వీరాస్వామి(43) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్వల్పగాయాల పాలైన వారిద్దరినీ చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు పితృవియోగం

సత్యవేడు: సత్యవేడు సింగిల్‌విండో చైర్మన్ కే. నిరంజన్ రెడ్డి తండ్రి కే. ప్రభాకర్ రెడ్డి(75) గురువారం ఉదయం మృతి చెందారు. కొల్లడం గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు. ఆయన మృతి సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మధ్యాహ్నం కొల్లడంకు వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అలాగే పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, సచివాలయ మండల కన్వీనర్ బొప్పన సోమశేఖర్ , ఎంపీటీసీ విడి శరవణన్, పూల పళణి, పలువురు నాయకులు నివాళులర్పించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

సత్యవేడు: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సత్యవేడు ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ నాయకులతో కలసి ఆందోళన చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల నెల వేతనం రూ. 26వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5లక్షలు, వేతనంలో సగం పింఛన్‌గా ఇవ్వాలన్నారు. హెల్పర్ల వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలన్నారు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, కాంతమ్మ, విజయలక్ష్మి, శాంతి, భారతి, అనూరాధ, భువన, సెందామరై బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



మిద్దెల హరిని సన్మానిస్తున్న పవిత్రారెడ్డి, ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకులు, ఆప్కో మాజీ డైరెక్టర్ మిద్దెల హరి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొట్టంబేడు పార్టీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి, బియ్యపు ఆకర్ష్ రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

‘ఆణిముత్యాల’కు సత్కారం

- విద్యా సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు
- విద్యారంగానికి సీఎం అధిక ప్రాధాన్యత
- పథకాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలి : ఎమ్మెల్యే



పదో తరగతి టాపర్, విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: ప్రభుత్వ విద్యా సంస్థల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ‘జగనన్న ఆణిముత్యాలు’ పేరిట ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సత్కరించారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓ కే. రవి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. పదోతరగతి టాపర్లకు మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5వేల చొప్పున, అలాగే ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీలలో టాపర్లకు రూ. 15వేల చొప్పున ఎమ్మెల్యే నగదు పురస్కారాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, పలు పథకాల అమలుతో విద్యారంగం స్వరూపాన్ని, స్కూళ్ల రూపురేఖలను మార్చివేశారన్నారు. ‘అమ్మ ఒడి, మనబడి నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద..’ ఇత్యాది పథకాలు ఎంతగా ప్రభావంతంగా అందుతున్నాయో ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. విద్యాకానుకను 4,878 మంది విద్యార్థులకు ఇచ్చారని, అలాగే 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, అన్ని పాఠశాలలకు ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్ని విద్యా సంస్కరణలు ఏ రాష్ట్రంలోనూ లేవని, విద్యార్థులు సీఎం ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

టెన్త్ ప్రతిభావంతులు వీరే

నారాయణవనం జెడ్పీ హైస్కూలు విద్యార్థి ఎస్. షణ్ముగనాథన్(586), కారిపాకం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మాచర్ల భరత్‌కుమార్ (583), పాలమంగళం ఎంపీపీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చదులూరు జ్యోత్స్న(578) మండల టాపర్లుగా నిలిచారు.

ఇంటర్ ప్రతిభావంతులు..

గవర్ల చందు ఎంపీసీ(970) (కేవీబీపురం), ఓలూరు రాము బైపీసీ(956) (కేవీబీపురం), ఎం. ప్రసన్న హెచ్ఈసీ(553)(నాగలాపురం), ఎలుగొండల సుశీరణ సీఈసీ (837) (వరదయ్యపాళెం మండలం). కార్యక్రమంలో మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పునిదకుమార్, బి.సోమశేఖర్, శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపీ.రవి, ప్రధానోపాధ్యాయులు భారతి, శ్రీనివాసులు, ప్రసూన, వసుమతి, ఇంటర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు అనిల్‌కుమార్ , టెంకాయల కృష్ణయ్య, మోహన్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగ : కల్లివెట్టులో..

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: ‘జగనన్న ఆణిముత్యాలు’ కార్యక్రమంలో భాగంగా గురువారం కల్లివెట్టు జెడ్పీ హైస్కూలులో టెన్త్ ప్రతిభావంతులు స్పందన, దీక్షిత్, భవ్యకు నగదు, ప్రశంసాపత్రంతో ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో స్థానిక కళాకారులకే ప్రాధాన్యత



అంజూరును సన్మానిస్తున్న శ్రీకాళహస్తీశ్వర డ్యాన్సర్స్ కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ నేతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకే మొదటి ప్రాధాన్యత ఇస్తామని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హామీ ఇచ్చారు. గురువారం నూతనంగా ఏర్పడిన శ్రీకాళహస్తీశ్వర డ్యాన్సర్స్ కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ యూనియన్ నాయకులు, సభ్యులు అంజూరును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన పైవిధంగా స్పందించారు. అలాగే రామసేతు వంతెన వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పోలయ్య, ఉమాపతి, ముజీబ్, వెంకటాచలం, ఎంఎస్ ఆషా తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ సాహిత్యానికి ఆద్యుడు శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీచర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆధునిక తెలుగు సాహిత్యంలో యుగకర్తగా పేరు పొందిన శ్రీశ్రీ వర్ధంతి పురస్కరించుకుని గురువారం మండలంలోని కల్లివెటు జెడ్పీ హైస్కూలులో ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి మాట్లాడుతూ, ఈ శతాబ్దం తనదంటూ ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు అభ్యుదయ సాహిత్యానికి ఆద్యుడిగా పాలకులు, పీడితులపై తన అక్షరాలతో కలాన్ని, గళాన్ని వినిపించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, ప్రసాద్, దేవేంద్ర, మాధవీలత, దాసు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కుక్కలగుంటలో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్

ఏర్పేడు: మండలంలోని కుక్కలగుంటలో సర్పంచ్ కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. వర్షాల మూలాన దోమల మోత పెరగడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వీధులు, మురుగు నీటి కాల్వలు, ఇళ్ల వద్ద ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

పోలీసులపై దాడి కేసులో జనసేన నాయకుడు అరెస్ట్

ఏర్పేడు: పోలీసులపై దాడిచేసిన ఘటనలో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజక ఇన్‌చార్జ్ కోటా వినూత భర్త కోటా చంద్రబాబును అరెస్ట్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం రాత్రి తెలిపారు. సీఐ కథనం.. ఈ ఏడాది మార్చిలో చిందేపల్లె సమీపంలోని ఎల్కట్రో స్టీల్ కాస్టింగ్స్ కర్మాగార యాజమాన్యం గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేశారని గ్రామస్తులు పలు పర్యాయాలు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో అప్పట్లో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజక ఇన్‌చార్జ్ కోటా వినూత గ్రామానికి చేరుకుని ఆందోళనకు పూనుకున్నారు. ఇది తెలుసుకుని చిందేపల్లెకు వెళ్లిన పోలీసులపై జనసేన పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడిచేశారు. ఈ దాడిలో అప్పటి రేణిగుంట రూరల్ సీఐ ఆరోహణరావు, బుచ్చినాయుడుకండ్రిగ ఏఎస్ఐ శివయ్య గాయపడ్డారు. పోలీసుల దాడి ఘటనలో అప్పట్లో కోటా చంద్రబాబు తదితరులపై కేసు నమోదు చేశారు. దీంతో చంద్రబాబు అజ్ఞాతంలోకి వెళ్లారు. యాంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తూ పోలీసుల కంటబడకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ పరిణామాల క్రమంలో ఆయన విజయవాడలోని ఒక హోటల్‌లో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అక్కడికి వెళ్లి అరెస్ట్ చేశారు. అతడిని ఏర్పేడు పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నట్లు సీఐ చెప్పారు.

‘జగనన్న విద్యాకానుక’ పంపిణీ



బీఎన్‌కండ్రిగ: నెలవాయిలో..

సత్యవేడు: జగనన్న విద్యాకానుక కిట్లును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ కే.రవి, ప్రధానోపాధ్యాయులు, భారతి, వసుమతి, పి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, చల్లమాంబపురం జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, జగనన్న విద్యాకానుక పథకంలో ప్రతి విద్యార్థికి మూడు జతల బట్టలు, ఒక జత షూ, బెల్టు, బ్యాగు, డిక్షనరీ, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు
పచ్చదనానికి ముప్పు

వేసవి వచ్చిందంటేచాలు శేషాచలం కొండలు అగ్నికీలలకు ఆహుతవుతూ ఉంటాయి. వేలాది హెక్టార్ల అడవుల్లోని అరుదైన వృక్షాలు, గడ్డి మైదానాలు కాలిపోతున్నాయి. జీవజాతులు మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన కొన్ని రోజులుగా మంగళంతోపాటు రామచంద్రాపురం, తిరుపతి గ్రామీణ, చంద్రగిరి మండలాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుని సుమారు వెయ్యి హెక్టార్లలో అడవి కాలిపోయింది.

– తిరుపతి మంగళం

- నిప్పు పెడుతున్న ఎర్రస్మగ్లర్లు, ఆకతాయిలు
- వెయ్యి హెక్టార్లలో అడవులు అగ్నికి ఆహుతి
- ముందస్తు చర్యలు తీసుకోని అధికారులు



మంగళం సమీపంలోని అడవిలో చెలరేగిన మంటలు(ఫైల్)

వేసవికాలంలో సంభవించే అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి అటవీశాఖ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల అడవుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. అటవీశాఖ అధికారులు అడవుల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏపుగా పెరిగిన బోద, గడ్డి, రాలిన ఆకులను తొలగించడంతోపాటు ఫైర్ లైన్లను ఏర్పాటు చేయాలి. ఫైర్ లైన్లు అడవులను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఎండిన ఆకులు, బోదగడ్డితోపాటు కొన్ని రాళ్లను ఫైర్ లైన్ మధ్య భాగంలోకి చేర్చి నిప్పుపెట్టి కాల్చేస్తారు. ఫైర్ లైన్ మధ్యలో ఒకవేళ అగ్ని ప్రమాదం సంభవించినా మరో ప్రదేశానికి మంటలు విస్తరించే అవకాశం ఉండదు. ఈ పనులను అటవీశాఖ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. గతంలో మంటలను ఆర్పేందుకు గ్రీన్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేర్లతో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై యువకులను నియమించుకునేవారు. వారితో సంచార దళాలను ఏర్పాటు చేసి నిరంతరం పహారా కాస్తూ, అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకునేవారు. ఒకవేళ సంభవించినా తక్షణం సదరు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేవారు. కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు, సిబ్బంది నియామకాలు చేపట్టడంలేదు. సాధారణంగా మార్చి నెలాఖరు, ఏప్రిల్, మే నెలల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచే ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే మంగళం సమీపంలోని అటవీ ప్రాంతంలో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా వందల ఎకరాల అడవి అగ్నికి ఆహుతైపోయింది. అరకొర సిబ్బందితో అటవీశాఖ చేపట్టిన నష్టనివారణ చర్యలు ఫలితం ఇవ్వలేదు. అలానే రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలం, చంద్రగిరి మండలాల పరిధిలోని అడవులు సైతం కాలిబూడిదవుతున్నాయి. అలాగే ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు శేషాచల పరిధిలోని తిరుపతి, చంద్రగిరి, మామండూరు, భాకరాపేట, తలకోన వంటి ప్రాంతాల్లోని అడవుల్లో మంటలు చెలరేగి సుమారు వెయ్యి హెక్టార్లు అగ్నికి ఆహుతి అయ్యాయి.

సిబ్బందిని సిద్ధం చేశాం

అగ్నిప్రమాదాలు నివారించేందుకు జనవరి నుంచి మే వరకు అడవుల్లో పనిచేసేందుకు ఫైర్ ప్రొటెక్షన్ వాచర్లను నియమించుకున్నాం. శేషాచలం కొండలతో పాటు, రిజర్వు ఫారెస్టు ఏరియాల్లో 200 కిలోమీటర్ల పొడవునా ఫైర్ లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఎన్జీవోల సహకారం కూడా తీసుకుంటాం. టీటీడీ అటవీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటాం. అగ్ని ప్రమాదాల సమాచారం ఇవ్వడంతోపాటు, మంటలార్పేందుకు సహకరించాలని అటవీ పరిసర గ్రామాల ప్రజలను కోరాం.

– సతీష్ రెడ్డి, అటవీ అధికారి, తిరుపతి జిల్లా

ఆణిముత్యాలే..రేపటి రత్నాలు



హాజరైన విద్యార్థులు

- టెన్త్, ఇంటర్ ప్రతిభావంతుల సన్మానంలో పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు చదువులే సోపానంగా ఉన్నత స్థానానికి చేరుకుని సమాజానికి విలువైన రత్నాలుగా ‘జగనన్న ఆణిముత్యాలు’ కావాలని తొట్టంబేడు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ విద్యార్థులను గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ‘జగనన్న ఆణిముత్యాలు’ కార్యక్రమం పేరిట ఘనంగా సన్మానించారు. వారికి నగదు బహుమతులతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలను పవిత్రారెడ్డి ప్రదానం చేశారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యారంగంలో జగనన్న అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా కావాలన్నారు. ఈ పురస్కారాలు విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ఇదే స్ఫూర్తితో అన్నింటా దూసుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మండల అధికారులు, పార్టీ నాయకులు గోరా, కొల్లూరు హరినాయుడు, ఫజల్, పాలమంగళం రవి, జయశ్రీ, దీపిక తదితరులు పాల్గొన్నారు.



తొట్టంబేడు : ఎస్వీఏ కళాశాల విద్యార్థిని చాందినిని అభినందిస్తున్న పవిత్రారెడ్డి, అధ్యాపక బృందం

ఇంటర్ విద్యార్థినికి ‘జగనన్న అణిముత్యం’

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలంలోని స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ బాలికల కళాశాలకు చెందిన హెచ్ఈసీ గ్రూపు విద్యార్థిని చాందిని జగనన్న ఆణిముత్యం నగదు పురస్కారాన్ని పవిత్రారెడ్డి చేతుల మీదుగా అందుకుంది. రూ.15వేల నగదు, ప్రశంసాపత్రం, మెడల్‌తో ఆమెను సత్కరించారు. నియోజకవర్గ స్థాయిలో హెచ్ఈసీ గ్రూపులో 861 మార్కులు సాధించడంతో చాందిని ఈ అవార్డుకు ఎంపికైంది. చాందినిని కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

లక్ష్య సాధనకు స్ఫూర్తి



నేను తొండమనాడు జెడ్పీ హైస్కూలులో చదివా. టెన్త్‌లో 589 మార్కులతో జిల్లాస్థాయిలో మొదటి స్థానం పొందడం చాలా ఆనందంగా ఉంది. మా అమ్మానాన్న గిరిజారెడ్డి, రమేష్‌రెడ్డి, గిరిజారెడ్డి బాగా ప్రోత్సహించారు. మా సార్లు (టీచర్లు) కూడా పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలి? ఎలా రాయాలో శిక్షణ ఇచ్చారు. వారందరి వలనే ఈస్థాయిలో మార్కులు సాధించగలిగా. ఇప్పుడు జగనన్న ఆణిముత్యం పురస్కారం నాలో ఆత్మవిశ్వాసాన్ని, లక్ష్య సాధనపై గురిని మరింత పెంచింది.

– ధృవితారెడ్డి

జగన్ మామయ్యకు థ్యాంక్స్



584 మార్కులతో జగనన్న ఆణిముత్యాల పురస్కారం పొందడం ఎంతో ఆనందంగా ఉంది. జగన్ మామయ్య గవర్నమెంట్ స్కూళ్లను బాగా డెవలప్‌మెంట్ చేశారు. అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నారు. మా తల్లిదండ్రులు శంకర్‌బాబు, నాగరత్నం ఏరోజూ చదువుల పరంగా ఒత్తిడికి గురిచేయలేదు. గురువుల బోధన, శిక్షణతోనే మంచి ఫలితాలు సాధించా. జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– పావని, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

మా అమ్మానాన్న కళ్లలో ఎంత ఆనందమో..!



నియోజక వర్గ స్థాయిలో 582 మార్కులుతో రెండవ స్థానం సాధించడం ఆనందంగా ఉంది. శ్రీకాళహస్తి జెడ్పీ బాలికల హైస్కూలు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే ఇది సాధించాను. నేను పురస్కారం అందుకుంటూంటే మా అమ్మ సుమతి, నాన్న సుబ్బరామయ్య కళ్లల్లో చెప్పలేనంత సంతోషం చూశా. ప్రభుత్వ ప్రోత్సాహంతో మరింతగా రాణిస్తా.

– బేబిశ్రీ

మరింత ప్రేరణ



582 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యం పురస్కారం అందుకోవడం జీవితంతో ఎన్నటికీ మరచిపోలేను. నాన్న కృష్ణయ్య, అమ్మ సులోచన ప్రోత్సాహం, మా స్కూలు టీచర్ల శిక్షణతోనే ఇది సాధించాను. పురస్కారం నాకు చదువుల పరంగా మరింత ప్రేరణ, ఉత్సాహం ఇచ్చింది.

– పూజిత, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు



సురుటుపల్లెలో నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకుని నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో గురువారం భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వర స్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరుని వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు నడుమ కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరాజనాలతో నైవేద్యం సమర్పించారు. అంతకు ముందు ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.



పిచ్చాటూరు : సిద్ధిరాజుకండ్రిగలో..

సోమనాథేశ్వరాలయంలో..

పిచ్చాటూరు మండలం సిద్ధిరాజుకండ్రిగలోని శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వరాలయంలో గురువారం నందీశ్వరునికి ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో గురువారం నందీశ్వరునికి ప్రదోష పూజలు ఘనంగా చేశారు. నందీశ్వరుని అభిషేకించి, విశేష పూజలు చేశారు.

అసలు, వడ్డీ చెల్లించాలని తీర్పు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో అసలుతో పాటు వడ్డీ చెల్లించాలని, లేనియెడల 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తిరుపతి 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గురువారం తీర్పుచెప్పింది. తిరుపతి రూరల్ మండలం ఎస్వీ నగర్‌కు చెందిన ఎం.నాగరాజు తన అవసరాల నిమిత్తం 2015 మార్చి 5న తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లి సమీపంలోని కొప్పరవాండ్లపల్లికి చెందిన వి.బాలకృష్ణయ్య వద్ద రూ.1.60 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2015 నవంబర్ 10న నాగరాజు ఇచ్చిన చెక్కు బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. బాలకృష్ణయ్య కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి చెక్కు సొమ్ము రూ.1.60 లక్షలకు 9 శాతం వడ్డీ లెక్కన చెల్లించాలని తీర్పుచెప్పారు. నష్ట పరిహారం కింద రూ.2.05 లక్షలను బాలకృష్ణయ్యకు నెలలోపు చెల్లించాలని నాగరాజును ఆదేశించారు. అలాగే అప్పీలు కాలం ముగిసిన తరువాత రూ.10 వేలు ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని తీర్పులో పేర్కొన్నారు.